01ATP25F_01ATP25F.qxd 25-02-2025 PM 11:08 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 26 ఫిబ్రవరి 2025 పేజీలు : 04

సైబర్ మోసాల పట్ల అవగాహన కోసం 2.5 కె రన్ నిర్వహించిన జిల్లా ఎస్పి జగదీష్

2.5 కె రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పి జగదీష్

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పి, తదితరులు

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కోసం మంగళవారం జిల్లా ఎస్పి జగదీష్ స్థానిక పోలీసు పెరేడ్ మైదానం వద్ద 2.5 కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఎస్పి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ 2.5 కె రన్ జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, క్లాక్ టవర్, కోర్టు రోడ్డు మీదుగా తిరిగి పోలీస్ పెరేడ్ మైదానంకు చేరుకుంది. సైబర్ మోసాలపై అవగాహన కోసం తయారు చేయించిన స్టిక్కర్లను టీషర్టులను అతికించుకుని 2.5 కె రన్‌లో పాల్గొన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడిన వారు వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930ను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో గత 14 రోజులుగా సైబర్ సురక్ష కార్యక్రమంలో సహకరించిన వారిని జిల్లా ఎస్పి అభినందిస్తూ మెమొంటోలను అందచేశారు. ఎస్‌బిఐ మేనేజర్, డిస్కవర్ అనంతపురం అనిల్‌కుమార్, యాంకర్ రమేష్, వీడియో ఎడిటర్ దుర్గ, చేతన్‌కళ్యాణ్, మీడియా వర్క్స్ శివానంద, ఏసిడిసి లోకల్ టివి రాజేష్, పినాకిని యాడ్స్ మురళి, మార్క్ ఆసుపత్రి, య్యూటుబర్ మస్తాన్, యాడ్స్ మధు, వీడియో గ్రాఫర్ జానీలకు ఎస్పి చేతుల మీదుగా మెమొంటోలను అందించారు. ఏఆర్ అదనపు ఎస్పి ఇలియాజ్‌బాష, అనంతపురం డిఎస్పి వి.శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు షేక్‌జాకీర్, కనుమురి సాయినాథ్, శ్రీకాంత్‌యాదవ్, రఘుప్రసాద్, ఆర్ఐ మధు, పిఆర్ఒ దామోదర్, సైబర్ సెల్ కానిస్టేబుల్ షెక్షావలిలను అభినందిస్తూ జిల్లా ఎస్పి మెమొంటోలను అందచేశారు.

ప్రశాంతి నిలయంలో వైభవంగా మహా పూర్ణాహుతి

పూర్ణాహుతిని నిర్వహిస్తున్న వేద పండితులు, ప్రత్యేక అలంకరణలో సాయి స్వర లింగం, మహా నారాయణ సేవలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు, రిత్వికులకు గోదానం చేస్తున్న మేనేజింగ్ ట్రస్ట్ దంపతులు.

పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:

పుట్టపర్తి ప్రశాంతినిలయంలో గత11 రోజులుగా నిర్వహిస్తున్న అతిరుద్ర మహాయజ్ఞ పూర్ణాహుతికార్యక్రమం అత్యంతవైభవంగా జరిగింది. భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లోభాగంగా, విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన మహత్తర కార్యక్రమం నేటి ఉదయం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాయిశ్వరాలింగానికి, ప్రత్యేక అలంకరణ చేశారు. మొదటగా గణపతిపూజతో మొదలు వేద పఠనంతో రిత్వికులు యజ్ఞ కుండలం వద్ద ఏకధాటిగా కొనసాగించిన వేద పఠనంతో ప్రశాంత నిలయం. రొట్టెకుల వేద మంత్రచారణ మధ్య సాయిశ్వర లింగానికి రుద్రం,నమకం,చమకం పారాయణం నిర్వహించారు. వివిధ ద్రవ్యాలు పంచామృతలతో అభిషేకాలను నిర్వహించారు. బిల్వ పత్రి సహిత పుష్పార్చన, గౌరీశంకరుల వివాహ మహోత్సవాన్ని రిత్వికులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈసందర్భంగా సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ దంపతులు పూర్ణాహుతిని నిర్వహించి, గోవును దానం చేశారు. అనంతరం వేద పండితులు యజ్ఞక్రతులలో నిర్వహించిన పవిత్ర జలాన్ని భక్తులపై సంప్రోక్షణ చేశారు. ఈ వేడుకలలో సుప్రసిద్ధ సంగీత గాయకులు తమ గానామృతంతో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా మహా యజ్ఞ కార్యక్రమంలో పాల్గొనే దేశ విదేశీ భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మహా నారాయణ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజు 3,500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహా యజ్ఞంలో సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, రిత్వికులు, వేలాది మంది దేశ విదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాడిపత్రి ప్రాంతంలో భయోత్పాతం సృష్టిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

- వైసీపీ వారిని ఊరు వదిలి పోవాలంటున్న పోలీసు అధికారులు - సజ్జనదిన్నెలో ఆక్రమణ తొలగింపు పేరుతో అరాచకం

- తాను తాడపత్రి లోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డంకులు - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త బ్యూరో

గత ఐదేళ్ల వైసిపి కాలంలో తాడపత్రి నియోజకవర్గంలో ఎక్కడ రాజకీయ వేధింపులు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోలేదని, ప్రస్తుతం టిడిపి హయాంలో తాడపత్రి ప్రాంతంలో టిడిపి నేత,తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి భయోత్పాతం సృష్టిస్తున్నారని వైసీపీ నేత, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. అనంతపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎప్పుడు వేధింపుల కేసులే తాడపత్రి ప్రాంతంలో నమోదు చేయలేదని, ఇప్పుడు స్థానిక రెవెన్యూ, పోలీసు, ఇతర అధికారులపై ఒత్తిడి తెచ్చి వైసీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా ఇక్కట్లకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాల వల్ల రాజకీయ పార్టీలు మారుతుంటాయి గానీ అధికారులు మాత్రం అట్లే ఉంటారు.. ఈ పరిస్థితుల్లో రెవిన్యూ, పోలీసు తదితర అధికారులు చట్ట పరిధిలో వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి సూచించారు.. తాడపత్రి ప్రాంతంలో తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పిందే చట్టాన్ని ఉల్లంఘించి వైసిపి కార్యకర్తలు, నాయకులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అధికారులను హెచ్చరించారు. స్వచ్ఛ సజ్జన దిన్నే పేరుతో గత మూడు రోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి పేరుతో చెప్పి వైసిపి సర్పంచు, ఇతర ఇల్లును పడగొట్టేందుకే ఆక్రమణలు తొలగించేందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి భయానక చర్యలకు దిగాడని, ఇందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆయన విమర్శించారు.. కోర్టు నుంచి గతంలో ఇంజక్షన్ ఆర్డర్స్ తెచ్చుకున్నప్పటికీ అధికారులు ఎలా ముందుకెళ్తారని? ఈ విషయం జిల్లా కలెక్టర్కు తెలుసా తెలియదా అని ఆయన ప్రశ్నించారు. తాడపత్రి రూరల్ మండలం గంగాదేవి పల్లెలో కూడా ఒక వైసీపీ నాయకుడి పై పోలీసులు బెదిరింపులు చర్యలకు దిగడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు మండలంలో గత 15 ఏళ్లలో చిన్న చిన్న సంఘటనలు మినహా ఎక్కడ రాజకీయ వేదింపు సంఘటనలు, దౌర్జన్యాలు జరగలేదన్నారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దవడుగూరు మండలంలో వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులు గురి చేస్తున్నారని, పెద్దవడుగూరు ఎస్సై ఆంజనేయులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. తాడిపత్రి లోకి నేను వెళ్లకుండా పోలీసులు పదేపదే అడ్డుకుంటున్నారు.. మరి జెసి ప్రభాకర్ రెడ్డి మాత్రం తాడిపత్రిలో ఉండవచ్చా అని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రశ్నించారు. తన వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగితే... మరి జెసి ప్రభాకర్ రెడ్డి చేస్తున్న పని ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలి కానీ ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఉండకూడదు కదా అన్నారు. పోలీసులు పక్షపాతం ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇది సరైనది కాదని హితువు పలికారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఒత్తిడి తో పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. తాడిపత్రి కి వెళితే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందని పోలీసులు చెబుతున్నారని తెలిపారు. తాడిపత్రి లో ఉండొద్దని వైఎస్సార్ సీపీ నేతలకు పోలీసులు చెప్పడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను ఊళ్లు వదిలి వెళ్లాలని పోలీసులే చెప్పడం సరికాదు అన్నారు. తాడిపత్రి లో శాంతి భద్రతల సమస్య వచ్చేది జేసీ ప్రభాకర్ రెడ్డి నుంచే తప్ప ఇతరులనుంచి కాదన్నారు.తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఇళ్లకు మునిసిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణం అన్నారు. తాడిపత్రి లో జేసీ ప్రభాకర్ రెడ్డి ఒత్తిడితో దాడులు తీవ్రమయ్యాయి, పబ్లిగ్గా జేసీ దౌర్జన్యాలు చేస్తున్నా పోలీసులు తమకేం తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రెండు రోజుల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఇక్కడికి ఓ ఫంక్షన్ కి వచ్చి చైర్మన్ ను ప్రశ్నించినందుకు చితకబాది తీవ్ర గాయాల పాలు చేశారని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విలేకరుల సమావేశంలో ఫోటోతో సహా చూపించారు. అధికారులు ఇష్టానుసారం వివరిస్తే న్యాయపరంగా వారిపై ప్రైవేటు కేసులు వేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పట్టుదల ఉంటే సాధించలేనిదేదీ లేదు

- యువతకు అపారమైన అవకాశాలు - ప్రణాళికతో చదివితే ఉద్యోగం సాధించడం సులువే

- ప్రభాతవార్త ఇంటర్వ్యూలో డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ఆయన ప్రాథమిక విద్య కోసం బడికి వెళ్లలేదు. ఐదో తరగతి వరకు ట్యూషన్‌లోనే చదువుకున్నారు. తర్వాత బడిమొదలైంది. అయితేనేం ఎక్కడా తడబడలేదు. ఉన్నత చదువులు చదివి.. తాను కోరుకున్నట్టుగా ప్రజలకు సేవ చేసే కొలువును సాధించారు. పట్టుదల ఉండాలే కానీ సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. ఇదీ జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) నగరడోన సలీం బాషా విజయ ప్రస్థానం. ఆయన ప్రభాత వార్తకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇంకా పలు విషయాలు వెల్లడించారు.

డ్వామా పీడీ సలీంబాషా

కుటుంబ నేపథ్యం:

మా స్వస్థలం కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్లు. అమ్మ గృహిణి, నాన్న రిటైర్డు హెచ్ఎం. ముగ్గురు సంతానం. ఇద్దరు అక్కల తర్వాత పుట్టిన నన్ను చాలా గారాబంగా పెంచారు. నా చిన్నప్పుడు చిల్లాకట్టి తయారు చేస్తుండగా చెక్కపేడు ఎడమ కంటికి తగిలింది. కొన్నాళ్ల తర్వాత ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆలస్యమైనందున ఎడమ కంటి చూపు కోల్పోవాల్సి వచ్చింది.

విద్యాభ్యాసం..

అమ్మానాన్న నన్ను ముద్దుగా చూసుకునేవారు. ఇంటి నుంచి బయటకు పంపేవారు కాదు. అందుకే నేను ప్రాథమిక విద్యకోసం బడికి వెళ్లలేదు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రైవేట్‌గా ట్యూషన్‌లో చదువుకున్నా. ఆలూరులోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్-2లో ఆరో తరగతికి పరీక్ష రాసి చేరాను. ఏడో తరగతి వరకు అక్కడే చదివాను. 8 నుంచి 10వ తరగతి వరకు కొడిగెనహళ్లి రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకున్నా. ఇక ఇంటర్మీడియెట్ విద్య గుంటూరు జిల్లా నాగార్జునసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ బీఎస్సీ (ఫారెస్ట్రీ) యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ జీకేవీకే బెంగళూరులో చేశాను.

తొలి ఉద్యోగం..

డిగ్రీ పూర్తయ్యాక ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డులో జూనియర్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరాను. తర్వాత ఉన్నత చదువులు చదవాలని ఈ ఉద్యోగానికి రాజీనామా చేసి...తిరుపతిలోని ఎస్వీ యూనివర్శిటీలో ఎంబీఏ చేశాను. ఆ తర్వాత ఎస్కే యూనివర్సిటీలో రూరల్ డెవలప్‌మెంట్ కోర్సు పూర్తి చేశాను.

నాన్న తర్వాత అక్క కూడా ఉపాధ్యాయ వృత్తి ఎంచుకున్నారు. నన్ను కూడా అదే మార్గంలో వెళితే బాగుంటుందని సూచించారు. అయితే నేను సున్నితంగా తిరస్కరించాను.

ప్రజలకు సేవ చేయాలని :

ప్రజలకు విస్తృతమైన సేవలందించాలని.. అందుకు ప్రభుత్వ ఉద్యోగం చేయాలని భావించాను. ఆ మేరకు గ్రూప్స్‌కు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నా. ఎంబీఏ చదువుతున్న సమయంలో లైబ్రరీలో పుస్తకాలు చదివి గ్రూప్స్‌కు ప్రిపేరయ్యా. 1994 ఆగస్టులో గ్రూప్-1 ప్రిలిమ్స్ రాశాను. అందులో అర్హత సాధించినా మెయిన్స్‌లో ఎంపిక కాలేకపోయాను. తర్వాత గోద్రేజ్ ఆగ్రోవెట్‌లోఉద్యోగంలో చేరాను. ఏడాదిన్నర పాట పని చేశాను. అప్పుడు గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడడంతో దరఖాస్తు చేశాను. ప్రిలిమ్స్, మెయిన్స్ వెనువెంటనే రావడంతో అందులో అర్హత సాధించడంతో 1996 సెప్టెంబరులో ఈఓఆర్‌డీగా కర్నూలు జిల్లా నందవరంలో తొలి పోస్టింగ్ వచ్చింది.

అంచలంచెలుగా:

ఈఓఆర్‌డీ నుంచి ప్రమోషన్‌పై 1999లో ఎంపీడీఓగా పత్తికొండకు బదిలీ అయ్యాను. అక్కడ దాదాపు ఐదు సంవత్సరాలు విధులు నిర్వర్తించాను. 2018లో డ్వామాలో వాటర్‌షెడ్ ఏపీడీగా పనిచేశాను. 2022 ఆగస్టులో డీఎల్‌డీఓగా పదోన్నతి పొంది ఏపీడీగా పనిచేశాను. 2023లో కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ పీడీగా నియమితులై ఏడాదిపాటు పనిచేశాను. 2024 అక్టోబర్ 4న అనంతపురం డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించాను.

ఉత్తమ అవార్డులు :

నా సర్వీసులో ఎంపీడీఓగా ఏడుసార్లు ఉత్తమ అవార్డులు అందుకున్నాను. ఏపీడీగా రెండుసార్లు, డీఆర్‌డీఏ పీడీగా, అనంతపురం డ్వామా పీడీగా ఒకసారి చొప్పున ఉత్తమ అవార్డులు స్వీకరించాను. ఉద్యోగ సర్వీసు ఇంకా 5 సంవత్సరాల 9 నెలలు ఉంది. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకుంటాం.

సర్వీసులో సంతృప్తి ఇచ్చినవి:

ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న సమయంలో డ్వాక్రా సంఘాల మహిళలు రుణాలు పొంది స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఎంపీడీఓ హోదాలో పనికి ఆహార పథకం కింద చాలా గ్రామాలకు రోడ్లు వేయించాం. పందికోన - పులికొండ రోడ్డు వంకలో ఉండటంతో తమ ఉద్ద ఉన్న ఈఏఎస్ నిధులు, ఎస్‌జీఆర్‌వై నిధులు, పనికి ఆహార పథకం నిధులతో రెండు బ్రిడ్జీలు నిర్మించి.. రోడ్డును సాఫీగా ఏర్పాటు చేసి రాకపోకలకు మార్గం సుగమం చేశాం. ఎంతో సంతోషాన్నిచ్చిన ఈ అంశం ఎప్పటికీ మరచిపోలేను. కర్నూలు డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన ఏడాది కాలంలో దుర్వినియోగమైన రూ.94లక్షలలో దాదాపు రూ.71 లక్షల సొమ్మును బాధ్యుల నుంచి ఏడు నెలల్లోనే రికవరీ చేయడం జరిగింది.

వైవాహిక జీవితం :

నాది పెద్దలు కుదుర్చిన వివాహం. 1996లో పెళ్లి అయ్యింది. మాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. అబ్బాయి పీజీ చదువుతున్నాడు. అమ్మాయి డిగ్రీ పూర్తి చేసింది.

యువతకు సందేశం :

నేడు యువతకు ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయి. అయితే ప్రభుత్వమా.. ప్రైవేటా అని కాకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తర్వాత అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలి. కష్టపడి పనిచేస్తే తప్పకుండా ఫలితం లభిస్తుంది. నేను ఎంబీఏ చదివేటపుడు లైబ్రరీలో పుస్తకాలు చదివి గ్రూప్స్‌కు ప్రిపేరయ్యా. గ్రూప్-2 సిలబస్ మారడంతో హైదరాబాద్ ఆర్‌సీరెడ్డి కోచింగ్‌సెంటర్‌లో మూడు నెలల శిక్షణ తీసుకున్నాను. అనుకున్న విధంగా ఉద్యోగం సాధించాను. యువత ప్రయత్నం చేస్తుంటే ఉద్యోగం సాధించడం పెద్ద సమస్యేమీ కాదు.

సామాజిక సేవకు నావంతుగా :

నేను ప్రత్యక్షంగా సామాజిక సేవ చేయకపోయినా... పరోక్షంగా సేవా కార్యక్రమాలు చేసేవారికి సహాయం చేస్తున్నాను. తద్వారా ఆత్మ సంతృప్తి పొందుతున్నాను.

నాటుసారా రహితంగా అనంత జిల్లాను తయారు చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నవోదయం 2.0పై జిల్లా ఎస్పి జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలన్నారు. అనంతపురం జిల్లా కర్ణాటక ప్రాంతానికి అంతరాష్ట్ర సరిహద్దు కలిగిన జిల్లా అని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరింత పదును పెట్టి పక్కాగా పనిచేయాలని ఆదేశించారు. నవోదయం 2.0పై డివిజన్ గ్రామస్థాయి సమావేశాలను వచ్చే నెల రోజుల్లోపు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. నాటుసారా నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తనిఖీలు జరగాలని, సమావేశాలను జాగ్రత్తగా నిర్వహించాలని, సమస్యాత్మక సమావేశాలకు ఎస్‌హెచ్ఎంలు హాజరు కావాలన్నారు. జిల్లాను, రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పి జగదీష్ మాట్లాడుతూ అటవీప్రాంతంలో నాటుసారా తయారీపై డ్రోన్‌ల ద్వారా తనిఖీలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో నాటుసారా నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎస్పి తదితరులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమీషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, జెడ్‌పి సిఇఓ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డివిఈవి వెంకటరమణనాయక్, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రూపొందించండి

- జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీ.ఎస్ .చేతన్

పుట్టపర్తి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంకల్ప ఫండ్స్,ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ నైపుణ్య అభివృద్ధి కమిటీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోనే మినీ కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షత నజిల్లా నైపుణ్యాభివృద్ధ సంస్థ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ స్కిల్ కమిటీ సమావేశం, 2025 2026 సంవత్సరానికి సంబంధించి డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ప్లాన్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మడకశిర మరియు కదిరి ప్రాంతాలలో సౌర నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి అని జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కంపెనీ అవసరాలకు అనుగుణంగా యువ నిపుణులను గుర్తించాలాన్నారు. ఆసక్తి ఉన్న ఇంటి నుండి పని చేసే నిపుణుల కోసం జీవో ఏపీ సర్వేలో డాట్ చేయవచ్చన్నారు. ఇంటి నుండి పని చేయడానికి మహిళా నిపుణులను గుర్తించడానికి కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు నిరుద్యోగ యువతకు నైపుణ్య కేంద్రాల ద్వారా విరివిగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.బెల్ కంపెనీ అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని మడకశిర ప్రాంతంలోని నైపుణ్య అభివృద్ధి అధికారికి ఆదేశించారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులు గుర్తించాలని అందుకు తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్తో జతకట్టడానికి మరియు కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువ నిపుణులకు అవసరమైన శిక్షణను అందించడానికి పరిశ్రమలతో చర్చించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ను ఆదేశించారు జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్,డిగ్రీ,డిప్లొమా, ఇంజనీరింగ్ కోర్సులు చేసిన వారిని గుర్తించి వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు మునుపు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ జిల్లాలో నిర్వహిస్తున్నటువంటి నైపుణ్య కార్యక్రమాల గురించి పిపిటి ప్రెసెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ గారికి వివరించారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్స్ ద్వారా జరిగే కార్యక్రమాలు, స్కిల్ కాలేజీ ద్వారా యువతకు ఇస్తున్న శిక్షణలు, సంకల్ప్ ప్రోగ్రాము ద్వారా నిర్వహించే శిక్షణల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్ నాగరాజు , లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ కుమార్ , డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కళ్యాణి, సీడాప్ జేడీఎం సూర్య నారాయణ , డిఆర్డిఏ పిడి నరసయ్య, తదితర కమిటీ సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం శివరాత్రి పండుగ జరుపుకునే ప్రతీ ఒక్కరూ సుఖసంతోషాలతో శివరాత్రి పర్వదినాన్ని అనందగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలపై ,ఈ కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పార్వతీ పరమేశ్వరుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు పరమేశ్వరుణ్ణి కోరుకున్నారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

- ఒకరికొకరు కొట్టుకునేంత వరకు వచ్చిన పరిస్థితి
- వైసీపీ కౌన్సిలర్లలో తారాస్థాయికి చేరిన వర్గపోరు

రసాభాసగా మారిన మున్సిపల్ సమావేశం దృశ్యం

రాయదుర్గం ఫిబ్రవరి 25(ప్రభాతవార్త)

రాయదుర్గం మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన సాధారణ సమావేశం రసాభాసగా మారింది ఉదయం 10 గంటల 30 నిమిషాలకు చైర్ పర్సన్ పోరాళ్ల శిల్ప అధ్యక్షతన ఏర్పాటు చేసుకోగా సమావేశానికి 16 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరు కాగా మిగతా 16 మంది గైర్హాజరయ్యారు ప్రారంభిస్తున్నట్లు చైర్ పర్సన్ మాట్లాడుతుండగా అసమ్మతి వర్గం కౌన్సిలర్లు వైస్ చైర్మన్ శ్రీనివాసులు వల్లి భాష సమావేశ కౌన్సిల్ హాల్ కు గొడవలోకి దిగారు కోరం లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని కమిషనర్ దివాకర్ రెడ్డిని నిలదీశారు దీంతో అరగంట పాటు ఒకరికి ఒకరు దూషించుకొంటూ గందరగోళం సృష్టించారు దీంతో చైర్మన్ సమావేశాన్ని వాయిదా వేశారు అనంతరం చైర్మన్ చాంబర్లో వైసిపి కౌన్సిలర్లు అందరూ మళ్లీ గొడవలకు దిగారు కౌన్సిల్ హాల్లో ఆలస్యంగా సమాచారం అందుకున్న పోలీసులు కౌన్సిలర్లు అందరినీ అక్కడ నుంచి పంపించేశారు.

ప్రజా సమస్యలు గాలికి వదిలేసి వాళ్లలో వాళ్లు కొట్టుకోవడమేంటి టిడిపి కౌన్సిలర్లు ప్రశాంతి జ్యోతి పద్మజ

రాయదుర్గం మున్సిపాలిటీలో అత్యధిక మెజార్టీ ఉన్న వైసీపీ కౌన్సిలర్లు మధ్య గొడవలు సారా స్థాయికి చేరాయని ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ఒకరికొకరు దూషించుకుంటున్నారని తెలుగుదేశం కౌన్సిలర్లు ప్రశాంతి బళ్లారి జ్యోతి పద్మజ ఆరోపించారు మంగళవారం కౌన్సిలర్ సమావేశంలో జరిగిన సంఘటనల గురించి పై విధంగా స్పందించారు పూర్తి మెజారిటీ ఉన్న అభివృద్ధి కుంటుపడిందని తమ స్వార్థ ప్రయోజనాల కోసమే మున్సిపాలిటీ వస్తున్నట్లు కనిపిస్తుందని వారు అన్నారు.

చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలే గొడవలకు కారణం మున్సిపల్ చైర్ పర్సన్ పోరాల శిల్ప : ఏకపక్షనిర్ణయాలే కౌన్సిల్లో గొడవలు కారణమని వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు కౌన్సిల్‌సమావేశం వాయిదాపడిన అనంతరం అజెండాలు తయారు చేసేటప్పుడు ఎవరిని సంప్రదించారని మున్సిపల్ సమావేశపు అజెండాలు చైర్మన్ ఇంట్లోనే తయారు చేస్తారని ఆరోపించారు చైర్మన్ పదవి నుండి తొలగిస్తారని ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

దేవాలయ నిర్మాణంకు విరాళం వితరణ

డి. హిరేహాళ్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

విరాళం అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణంకు విరాళం వితరణ చేశారు. మంగళ వారం రాయదుర్గం పట్టణంలోని ఆయన స్వగృహంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి న్యాయ సలహాదారులు రవిచంద్ర, వాల్మీకి యూత్ హరీష్ కుమార్ లతో కలిసి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు రూ. 5100లు అందజేశారు. గుమ్మగట్ట మండలం ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు మరో నలుగురు సభ్యులతో కలిసి వాల్మీకి సంఘం అధ్యక్షులను ఆయన స్వగృహంలో కలుసుకొని ఆలయ నిర్మాణం విషయం ఆయనకు వివరించి మీ వంతు సహాయం అందించాలని అందుకు ఆయన సమ్మతించి విరాళం అందించారు. ఈ సందర్భంగా విరాళ అందుకున్న కమిటీ సభ్యులు మాట్లాడుతూ కుల మత రాజకీయాలకు అతీతంగా అడిగిన తక్షణం స్పందించి మీ వంతు సహాయ సహకారాలు అందించినందుకు తమకు ఆనందంగా ఉందని వారు ఆయనకు అభినందనలు తెలిపారు.

అంగన్ వాడి కార్యకర్తలకు ముగిసిన శిక్షణా తరగతులు

బ్రహ్మ సముద్రం.ఫిబ్రవరి 25. ప్రభాతవార్త

శిక్షణ తరగతుల దృశ్యం

మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల యందు మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న యఫ్ ఎల్ యన్ జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు నేటితో ముగిశాయి ఈ ముగింపు కార్యక్రమానికి మండల విద్యాధి కారులు.ఒబు లపతి .కృష్ణ నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా కార్యకర్తల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇచ్చట మీరుపొందిన శిక్షణలో భాగంగా మీ సెంటర్ యందు పిల్లలకు బాల్యా రంబ సంరక్షణ ను అన్ని అభివృద్ధి విభాగాలలో సామర్థ్యాలను పెంపొందించి ప్రాతమిక పాఠశాలకుసన్నద్దం చేయాలని తెలియ చేశారు. ఈ కార్య క్రమంలో రీసోర్స్ పర్సన్లుగా వి అర్చన.జే రామాంజ నే యులు.పి.జగదీష్.సూపర్ వైజర్ లు రామంజి నమ్మ.ఖాషింభీ.మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

ఉద్యాన శాఖ రాయితీలు రైతులు ఉపయోగించుకోవాలి.

శెట్టూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

పూత దశలు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ అమలు చేయు పథకాలపై అవగాహ న సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో భాగంగా ఉద్యాన పంటల్లో చేపట్టాల్సి నటువంటి సస్యరక్షణ చర్యలు తెగుళ్లు వాటిని నివారణ గురించి డా.యుగంధర్ (ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం) కళ్యాణదుర్గం రైతులకు వివరించారు. ప్రభుత్వం రాయితీతో ఉద్యాన శాఖ వారు అందిస్తున్న. పథకాలను శెట్టూరు.కంబదూరు ఉద్యనా అధికారిని గౌసియా మాట్లాడుతూ.ప్రస్తుతం ఉద్యనాశాఖ 202425 ఆర్థిక సంవత్సరం అమలుచేయు పథకాల వివరాలు తెలుపుతూ తైవాన్ స్ప్రేయర్లు,ట్రాక్టర్ మోంటెడ్ స్ప్రేయర్లు,మినీ ట్రాక్టర్లు, మల్చింగ్ స్టేకింగ్ పద్ధతిలో కూరగాయల పంటలు సాగుచేస్తున్న ట్లయితే 4050 రాయితీ అందిస్తున్నామని తెలియచేసారు.. అలాగే మామిడి సాగు చేసే రైతులకు "మ్యాంగో ఫ్రూట్ కవర్స్" కూడా 50 రాయితీ ఉందని ఒక కవర్ ధర 2/. ఇలా రైతుకు ఒక హెక్టారుకు రూ.10/ వేలు రాయితీ అందిస్తున్నారని తెలియజేశారు కావున ఈ అవకాశాన్ని ఉద్యాన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఈ పథకాలు కావలసినవారు తమను నేరగా సంప్రదించాలని తమ సూచన సలహాలు రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో.శిశీరీ అధికారి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానం నయనం ప్రధానం

- మానవ శరీరంలోని అన్ని అవయవాల కంటే కళ్ళు ఎంతో ప్రధానమైనవని
- ఉచిత కంటి చికిత్సల శిబిరం ఏర్పాటు చేసిన దాత తెలుగుదేశం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు

కంటి పరీక్షల వైద్య శిబిరంకు హాజరైన వారితో దాత, వైద్యులు

డి. హిరేహాళ్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

సర్వేంద్రియానం నాయనం ప్రధానమంటూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మంగళవారం డి.హిరేహాళ్ మండల కేంద్రంలోని శ్రీ శివలింగ సిద్ధారుడా స్వామి మఠంలో తెదేపా నాయకులు శ్రీరాములు, తిప్పేస్వామి, సూరి తదితరులతో కలిసి ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బళ్లారి పట్టణ సమీపంలోని తాళ్లూరు రోడ్డులో ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యతో ఆయన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేయించి కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచిత పరీక్షలు చేయించడం అభినందనీయమని అంటి పరీక్షలకు హాజరైన పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా దాత నాగళ్ళి మాట్లాడుతూ కంటి పరీక్షలకు విచ్చేసిన వారందరికీ వైద్యపరీక్షల అనంతరం అవసరమైన ఉచిత మందులు, మాత్రులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శస్త్ర చికిత్సలకు హాజరైన వారికి ఎల్వీ ప్రసాద్ అంటే ఆసుపత్రిలో చికిత్సలు చేయడం జరుగుతుందని, అంటే అద్దాలు అవసరమైన వారికి అద్దాలు అందజేయడం జరుగుతుందని, చిన్నచిన్న సమస్యలతో ఇబ్బంది పడే వారికి అవసరమైన మందులు అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరంకు పరీక్షల కోసం 107 మంది హాజరుకాగ సత్ర చికిత్సలకు 36 మంది, కంటి అద్దాలు అవసరమైన వారు 56మంది, స్వల్ప కంటి సమస్యలతో బాధపడుతున్న వారు 15 మంది ఎంపికైనట్లు ఆసుపత్రి వైద్య బృందం తెలిపారు. శాస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి బుధవారం చికిత్సలు చేయడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు దాత, వైద్య బృందం చెప్పారు.

గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

-హాజరైన ఏసీ, టీడీపీ, బిజెపీ, జేఎస్‌పీ నాయకులు, వీరశైవ సంక్షేమ సమాజం బాధ్యులు

గవిమఠం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మఠం ఏసీ, టీడీపీ, బిజెపీ, జేఎస్‌పీ నాయకులు, వీరశైవ సంక్షేమ సమాజం బాధ్యులు

ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ప్రసిద్ధ గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 4వ తేదీ నుండి ప్రారంభమై 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పట్టణంలోని స్థానిక గవిమఠ సంస్థానంలో మంగళవారం మఠం సహాయ కమీషనర్ కె.రాణి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, వీరశైవ సంక్షేమ సమాజం బాధ్యులు, పట్టణ ప్రముఖులు పలువురు హాజరైన బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహాయ కమీషనర్ కె.రాణి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు దిగ్విజయం కావడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు రేగటి నాగరాజు, ఎన్.విజయభాస్కర్, మోపిడిగోవిందు, మాదినేనిరామాంజినేయులు, నెట్టంరాంబాబు, యర్రగుంట్లవెంకటేష్, పెద్దకోట్లరాజేష్, చాబాల సి.ఎర్రిస్వామి, పెద్దముష్టూరు బోసు, యం.రామాంజినేయులు, చేజాలప్రభాకర్, రహంతుల్లా, ఎం. ప్రసాద్, తాజుద్దీన్, ఇంద్రావతి ఓబులేసు, విశ్వనాథ్, జనసేన నాయకులు గౌతమ్‌కుమార్, చంద్రశేఖర్, గుడిసెల రాజేష్, బీజేపీ నాయకులు మాదినేని లక్ష్మినారాయణ, ఆచారి, విద్యావేత్త డి.ఎర్రిస్వామి, వీరశైవ సమాజం బాధ్యులు ఆర్డీటీ మల్లికార్జున, గంగాధర్, నాగన్నగౌడ్, నిరంజన్‌గౌడ్, జొజ్జప్ప, యోగేష్‌స్వామి, వీరేష్‌స్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాటికోటేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ రత్న

తాడిమర్రి ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త)

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శివాలయాలు

మండల వ్యాప్తంగా రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆలయాలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా వెలుగొందుతూ భక్తులకు కనువిందు చేస్తున్నాయి. మండల కేంద్రంలో వెలసిన పురాతన శివాలయంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.చిల్లవారి పల్లి గ్రామ సమీపంలో ఇంద్రకీలా పర్వతంపై వెలసిన శ్రీ కాటి కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కాటి కోటేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంగళవారం జిల్లా ఎస్పీ వి రత్నాతో పాటు డిఎస్పి హేమంత్ కుమార్ సీఐ శ్యాం రావు ఎస్సై కృష్ణవేణిల ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షించారు.

కాటి కోటేశ్వర క్షేత్రంలో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సత్యసాయి జిల్లాఎస్పి రత్న

దొడగట్ట గ్రామంలో పి 4 సర్వేను తనకి చేసినా ఆర్డీవో

కళ్యాణదుర్గం రూరల్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

సచివాలయ సిబ్బంది చేస్తున్నటువంటి పి 4 , సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో జ.వసంత బాబు

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి జ.వసంత బాబు డివిజన్ పరిధిలోని స్థానిక కళ్యాణదుర్గం మున్సిపాలిటీ నందు గల దొడగట్ట గ్రామం నందు సచివాలయం సిబ్బంది చేస్తునటువంటి పి4 సర్వే ను మంగళవారం రోజున తనిఖీ చేయడం జరిగింది. పి4 సర్వే ను ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపల పూర్తి చేయాలనీ, ప్రతీ ఇంటిని తప్పకుండ సర్వే చేయాలనీ సంబంధిత సిబ్బందిని ఆదేశించడం జరిగినది. సదరు తనిఖీ నందు తహసీల్దార్, భాస్కర్ పాల్గొనడం జరిగినది.

మాజీ ఎమ్మెల్యే భార్య మృతి పలువురు సంతాపం

హిందూపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

హిందూపురం మాజీ ఎమ్మెల్యే పామిశెట్టి రంగనాయకులు భార్య ఈశ్వరమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ముద్దిరెడ్డిపల్లిలోని వారి నివాసంలో సోమవారం రాత్రి మృతి చెందారు హిందూపురం పట్టణానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం ఈశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు నివాళులర్పించిన వారిలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్, వైసిపి ముఖ్య నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి, వైసిపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ జయప్ప, పట్టణానికి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు.

కర్నూలులో బోర్డు ఏర్పాటు చేయండి

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

డి,టీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కృష్ణానది జలాల బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని జల సాధన సమితి నాయకులు మంగళవారం అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించి అనంతరం హిందూపురం డిప్యూటీ తాసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ కృష్ణానది జలాలు కృష్ణా గుంటూరు జిల్లాలలో 60 నుండి 70 శాతం సాగుభూమికి మీరు అందుతున్న ప్రాంతం ప్రకాశం బ్యారేజ్ నుంచి వందల టీఎంసీల సముద్రం పాలు అవుతున్న విజయవాడ ప్రాంతంలో కృష్ణానది బోర్డు ఏర్పాటు చేయడం సబబు కాదని రాయలసీమలో కృష్ణా జలాల తో 15 శాతం సాగు భూమికి మాత్రమే నీరు అందుతుందని అందులో అనంతపురం జిల్లా కేవలం మూడు శాతం మాత్రమే నీరు అందుతుందని కరువు ప్రాంతమైన రాయలసీమకు కృష్ణా జలాలతో న్యాయం జరగాలంటే కర్నూలులో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జలసాధన సమితి అధ్యక్షుడు రామ్ కుమార్, హిందూపురం డివిజన్ జలసాధన సమితి నాయకులు వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, చిదంబర రెడ్డి, సోమకుమార్, ఆనంద రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, తిప్పేస్వామి, నవీన్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించండి

తెదేపా రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ

పుట్టపర్తి , ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

రాష్ట్ర కార్యవర్గాన్ని దుశ్శాలువలతో సన్మానిస్తున్న దృశ్యం

అత్యంత వెనుకబడిన శ్రీ సత్యసాయి జిల్లాలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగపు కార్యదర్శి మహమ్మద్ రఫీ కోరారు. మంగళ వారం నంద్యాలలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తక్ అహ్మద్ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగపు కార్యదర్శి మహమ్మద్ రఫీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తక్ అహ్మద్ సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మహమ్మద్ రఫీ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడ్డ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని, బిసి క్యాటగిరిలో వెనుకబడిన ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చి స్వయం ఉపాధి క్రింద సబ్సిడీ రుణాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే మస్జిదులు, ఈద్గాలు, షాది ఖానాల అభివృద్ధికి, మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఇమామ్, మోజన్ లు పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి గౌరవ వేతనాలు అందించాలని కోరారు. అలాగే ముస్లిం మైనార్టీలలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని, విద్యార్థులు ఆర్థిక సమస్యలతో విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఎంతోమంది మైనార్టీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారిని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

శివాలయంలో అన్నదానం

గుత్తి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

భోజనం వడ్డిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద వున్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు గావించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన భోజన వితరణ కార్యక్రమాన్ని టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ హాజరై భక్తులకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం శివునికి ప్రత్యేకంగా అభిషేకాలు గావించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు, ఎన్‌డిఏ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షిలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

-మహాగణపతి, సుదర్శన హోమంతో ప్రారంభం

లేపాక్షి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

పూజా కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ రామానందన్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి దేవాలయంలో మహాగణపతి, సుదర్శన హోమంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఇఒ

గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసింహమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రామా నందన్‌లు పూజలు నిర్వహించి కార్యక్రమా లను ప్రారంభించారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మహాగణపతి, సుదర్శన హోమం భక్తజన సందోహం మధ్యన ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామానం దన్, ఆలయ ఇఒ నరసింహమూర్తి, మండల ఉపాధ్యక్షులు అంజనరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, దుర్గా నవీన్, బిజెపి మండల అధ్యక్షులు నరసింహమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో వేదపండితులు సునీల్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివపార్వతులు ప్రత్యేక వాహనంపై ఆలయం నుండి రాజవీధి గుండా ప్రధాన రహదారిలో నంది విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడి నుండి రాజవీధి గుండా ఆలయం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆలయాన్ని చేరుకున్నారు. సాయంత్రం 7.30 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు మహాశివరాత్రి ఉత్సవం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లేపాక్షి ఆలయంలో బుధవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు, 10 గంటలకు దీపోత్సవం, రుద్రహోమం, 11 గంటలకు వృషభ వాహనోత్సవం, 12 గంటల నుండి 2 గంటల వరకు స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్, ఇఒ నరసింహమూర్తి తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు నాలుగు యాము పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు తెలిపారు. అదేవిధంగా జాగరణ సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు భక్తులు రావాలని వారు సూచించారు.

శ్రీదుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి , ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, ప్రత్యేక అలంకరణలో పాపనాశేశ్వరస్వామి

లేపాక్షి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

శిల్పకళలకు నిలయమైన లేపాక్షి ఆలయంలో శ్రీదుర్గాదేవి, వీరభద్రస్వాములకు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లు మంగళవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. దుర్గాదేవికి కుంకుమార్చనలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

చిలమత్తూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మూత్రవిసర్జన చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్‌అహమ్మద్ తెలిపారు. వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలు సమాజంలో ప్రశాంతంగా జీవించాలే గానీ వివాదాస్పద వికృత చేష్టలు గాని, చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వుంటుందని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ఆదివారం ఆలయం వద్ద జరిగిన సంఘటనసై రాత్రికి రాత్రే మూత్రవిసర్జన చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు తమదైన శైలిలో విచారించి అతన్ని రిమాండ్‌కు పంపినట్లు వారు తెలిపారు. జరగబోయే బ్రహ్మోత్సవాల్లో కూడా ఎవరైనా ఆకతాయిలు పోలీసుల విధులకు ఆటంకం కలిగేలా చేసినా, సాంప్రదాయ పద్ధతులకు విఘాతం కలిగేలా ప్రవర్తించినా వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సంతోషంగా ఉత్సవాల్లో పాల్గొని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పోలీసుల విధులకు ప్రజలు హకరించాలని వారు కోరారు.

అనధికార లేఔట్లకు ఆస్కారమే లేదు అహుడ చైర్మన్ టీసీ వరుణ్ హెచ్చరిక

అనంతపురం వైద్యం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో వేసిన, వేయబోతున్న ప్రతి లే ఔట్ కు నియమ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరి. అనధికారికంగా లేఅవుట్ లు వేసేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని అహుడ చైర్మన్ టీసీ వరుణ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన అహుడ అధికారులతోకలిసి అనాథరైజ్డ్ లేఅవుట్ల అంశం గురించి సమీక్షించారు. అహుడ పరిధిలోని 57 మండలాలు, 993గ్రామపంచాయతీలో ఎక్కడెక్కడ లేఅవుట్లు వేశారు.. వాటిలో అనుమతులు ఎన్నింటికి ఉన్నాయి.ఎందరు అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వేశారన్న అంశం గురించి చర్చించారు. ఇప్పటికే ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కూడిన రెండు ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ బృందాలు అహుడ పరిధిలో పర్యటిస్తున్నాయని, ఎక్కడ అనాథరైజ్డ్ లేఅవుట్లు ఉన్న ముందుగా వాటిని తొలగించిన అనంతరం నోటీసులను పంపడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని అధికారులు చైర్మన్ టిసి వరుణ్ దృష్టికి తీసుకొచ్చార

03ATP25_03ATP25.qxd 25-02-2025 PM 11:09 Page 1

పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఐపిఆర్, సైబర్ సెక్యురిటీపై అవగాహన వర్క్‌షాప్

అనంతపురం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త బ్యూరో

పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అనంతపురంలో ఎంసిఏ విభాగం ఆధ్వర్యంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్ (ఐపిఆర్), సైబర్ సెక్యురిటీ అనే అంశంపై ఒకరోజు అవగాహనా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టియు ప్రొఫెసర్, డైరెక్టర్, ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్‌క్యూబేషన్ సెంటర్, కంప్యూటర్ సైన్స్ విభాగం, డా.సి.శోభ బిందు ముఖ్య వక్తగా హాజరై వివరణాత్మకమైన శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.బండి రమేష్‌బాబు, ఎంసిఏ విభాగాధిపతి చంద్రకాంత్, పివికెకె ఐటి ఐపిఆర్ కోఆర్డినేటర్ డా.చెన్నకేశవులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐపిఆర్ (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్) ప్రాముఖ్యత : ఐపిఆర్ అంటే ఏమిటి..? ఎందుకు అవసరం..? అనే అంశాలపై డా.సి.శోభ బిందు వివరించారు. పేటెంట్‌లు, ట్రేడ్ మార్కులు, కాపిరైట్, డిజైన్ హక్కులు వంటి మేధో సంపత్తి హక్కుల గురించి వివరించి, ఒక వ్యక్తి లేదా సంస్థ అభివృద్ధి చేసిన ఆవిష్కరణలు, సాంకేతికత, సాఫ్ట్‌వేర్‌లు, పరిశోధనలు, డిజైన్లు, కళా రచనలు, ప్రకటనలు వంటి అంశాలను చట్టపరంగా ఎలా రక్షించుకోవవచ్చు..? అనే దానిపై స్పష్టతనిచ్చారు.

సైబర్ సెక్యురిటీ ప్రాముఖ్యత : సమాజంలో డిజిటల్ విప్లవం విస్తరించడంతో సైబర్ భద్రత అత్యంత కీలకంగా మారింది. ఈ వర్క్‌షాప్‌లో సైబర్ నేరాలు, ఫిషింగ్, హ్యాకింగ్, రాన్సమ్‌వేర్ దాడులు, డేటా లీకేజీ, సోషల్ మీడియా మోసాలు లాంటి ముప్పుల గురించి చర్చించారు. వ్యక్తిగత డేటా రక్షణ, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, సురక్షితమైన ఇంటర్నెట్ వాడకం, ఫైర్‌వాల్‌లు, యాంటి-వైరస్ సాఫ్ట్‌వేర్‌ల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

జేఎన్‌టియు ప్రొఫెసర్ డా.సి.శోభ బిందుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

విద్యార్థులకు ప్రయోజనం : ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సొంత ఆవిష్కర ణలను చట్టపరంగా ఎలా రక్షించుకోవాలి..? సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలి..? అనే అంశాలపై ప్రాక్టికల్ అవగాహన పొందారు. విద్యార్థులు తమ భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలు చేయాలనే ఆలోచనలతో ఉన్న ప్పుడు, అవి ఇతరులు అనధికా రికంగా వాడుకోకుండా ఎలా రక్షించుకోవాలి..? అనే దానిపై స్పష్టత పొందారు. ఈ కార్యక్ర మంలో ఎంసిఏ విభాగం, విద్యార్థులకు ఉపయోకగరమైన కార్యక్రమాలను మరింత ప్రోత్సహించ నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.బండి రమేష్‌బాబు తెలిపారు. విద్యార్థులకు ఈ అంశంపై ఇంకా ఎక్కువ అవగాహన కల్పించేందుకు భవిష్యత్తులో మరిన్ని వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన తెలుగు తమ్ముళ్లు

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండా వాసులకు కల్లురు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తాను అసెంబ్లీ సమావేశంలో ఉన్నందున వారిని పరామర్శించేందుకు తెలుగు తమ్ముళ్లకు సూచించారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రోడ్డు ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమని క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గిరిజనులను పట్టించుకోలేదని అని కొందరు అనడం సరైన పద్ధతి కావడం, అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని తెలిసి కూడా రాజకీయ కోణంలో మాట్లాడటం తగదన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకో వాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు గుర్రం లక్ష్మినారాయణ, తరిమెల విజయ్ కుమార్, బండమీదపల్లి చెన్నయ్య, నాయ క్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న టిడిపి నేతలు

మామిడి రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు - ఉద్యానశాఖ అదికారి శైలజ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మామిడి రైతులకు నాణ్యమైన దిగుబడి కొరకు రాయితీతో ఫ్రూట్ కేర్కె అక్టివిటీ ఫుడ్ కవర్స్ గురించి ఉద్యానశాఖ అదికారి శైలజ బుక్కరాయసముద్రం మండల పరిదిలోని బొమ్మలాటపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతూ మామిడి పిందె దశ నుంచి నిమ్మకాయ లేదా గోలి సైజులో ఉన్నపుడు ఈ ఫ్రూట్ కవర్లో దొరకడం వలన ఫ్రూట్ మంగు మచ్చలు, కాయల రంగు, మామిడి టెంక పురుగు, పండు ఈగ వివిధ పురుగులు తెగుళ్ళ నుండి రక్షణ ఇచ్చివిధంగా తోడ్పాడుతుంది. చెక్కగుజ్జుతో తయారైయినా పేపరుకాయికి మంచి లక్షణాలు ఉంచి చెడు లక్షనాలు తీసివేస్తుంది.

ఈ సంచి ఉండటంవలన ఎటువంటి క్రిమికీటకాలు పండ్లను నాశనం చేయకుండా ఉంటుంది. పురుగుమందులు వాడకం తగ్గుతోంది కాయ లను అదిక సూర్యరశ్మి నుండి కాపాడుకోవచ్చు. తొడిమ ధ్రుఢంగా ఉంది. అలాగే కాయ మంచి సహజ రంగుకూడ పెంచుతుంది. అలాగే ఎక్కువ రోజు లు పండ్లు పడకుండా నిల్వ ఉండేలా చేస్తుంది. ఈ ఫ్రూట్ కవర్లు కూడా ప్రభు త్వం రాయితీ 50%తో ఇవ్వడం జరుగుతు ందన్నారు. ఒక రైతుకు రెండున్నర ఎకరాలవరకు పదివేల కవర్లకు రెండు రూపాయల చొప్పున 20000 ఖర్చు అయితే దానికి 10000 రూపాయలు రాయితీ ఇవ్వబడును. మ్యాంగో ఫ్రూట్ కవర్ పథకానికి ఇతర వివ రాల కొరకు రైతు సేవా కేంద్రల్లో సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు వెంకటరెడ్డి, కుళ్ళాయిరెడ్డి, కేకే అగ్రహారం మాజి సర్పంచు గోవిందు రెడ్డి, రైతుసేవా సిబ్బంది నదియా, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి పిందెలకు కవర్లు తొడుగుతున్న సిబ్బంది

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా శివాల యాలతోపాటు మిగిలిన దేవాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని చిన్న కాలువ శివాలయం పృశ్యసృంగముని కొండపైన దోన రామేశ్వరస్వామి ఆలయాల్లో జరిగే పూజలకు పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. మండల కేంద్రంలోని చిన్న కాలువ శివాలయానికి శివ పార్వతుల విగ్రహాలు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, బండారు లీలావతి, బండారు రవి కుమార్, వారి కుటుంబ సభ్యులు 1.50లక్షలతో ప్రసిద్ధి చెందిన శిల్ప కళాకారులతో రూపుదిద్దిన విగ్రహాలను ఆలయ కమిటీకి అందజేశారు. 26వ తేది చతుర్దశి, తిథి ధనుష్ట నక్షత్రం రాత్రి 8 గంటల నుంచి 9 :10 వరకు కన్యాలగ్నం శుభ పుష్కరాంశములో శివపార్వతుల కళ్యాణం జరుగును. అనంతరం వచ్చిన భక్తాదులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవానికి మండల వ్యాప్తంగా ఉన్న భక్తులందరూ హాజరై శివ పార్వతుల అనుగ్రహం పొందాలని, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 27వ తేది సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని పుర వీధుల గుండా శివ పార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబైన చిన్నకాలువ శివాలయం

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి అభినందనలు

అనంతపురం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా కోర్టు పబ్లిక్ ప్రభుత్వ న్యాయవాది హరినాథ్‌రెడ్డికి వైఎస్ఆర్‌సిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి అనంతపురం కోర్టు కార్యాలయంలో మంగళవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దోషులకు కఠిన శిక్షలు పడేలా వాదిస్తున్నందు వల్ల నేరం చేయాలంటే భయపడే పరిస్థితి వస్తుంది అన్నారు. గత కొంత కాలంగా ఎంతోమంది నేరస్తులకు యావజ్జీవ శిక్ష పడేలా హరినాథ్‌రెడ్డి వాదించి న్యాయాన్ని నిలబెట్టారు అన్నారు. హత్యకేసులో ఐదుగురికి యావజ్జీవ శిక్ష పడటం మంచి విషయం అన్నారు. నేరస్థులు హత్యచేసి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో బయోత్పాతం సృష్టించారన్నారు. ఇలా విచ్చల విడి నేరాలు చేసేవారికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి వంటి వారు న్యాయం వైపు నిలబడి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా వాదించడం వలన న్యాయ వ్యవస్థపై ప్రజలకు అపార నమ్మకం ఏర్పడుతుందన్నారు. హరినాథ్‌రెడ్డి ప్రభుత్వ న్యాయవాదిగా వచ్చినప్పటి నుంచి అనేక కేసుల్లో కఠిన శిక్షలు పడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి ఐటి విభాగం నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌ని అభినందిస్తున్న దృశ్యం

సామాజిక పింఛన్ల వెరిఫికేషన్

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో సామాజిక పింఛన్ వెరిఫికేషన్ చేశారు. మంగళవారం డాక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. ప్రతి వారం ఒక వైద్యుడు మూడు రోజులపాటు ప్రతి రోజు 50 సామాజిక పింఛన్లు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల పింఛన్లు వెరిఫికేషన్ జరుగుతున్నట్లు ఈ ప్రక్రి పూర్తి కావడానికి జూన్, జులై వరకు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తరిమలె సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ హరిణి, కల్లుమరి డిజిటల్ అసిస్టెంట్ అరుణ్ పాల్గొన్నారు.

పింఛన్లు వెరిఫికేషన్ చేస్తున్న వైద్యులు

జాతీయ సమైక్యతా శిభిరంలో రెంవ బహుమతి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

జాతీయ సమైక్యతా శిభిరానికి ఎంపికై డిజిట్, సంప్రదాయ వస్త్ర దారణలో రెండవ బహుమతిని ఆర్ట్స్ కళాశాలలో చదువు తున్న ఎన్ఎస్ఎస్ వాలెంటీర్ ఎస్.మహేష్ సాధించాడు. ఈ సమైక్యతా శిభిరము మహారాష్ట్ర లో కొల్హాపూర్‌లో ఫిబ్రవరి 16 నుంచి 22 నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జయలక్ష్మి, బాలాజీనాయక్, సుధాకర్, సోమశేఖర్, శ్రీనివాసులు అభినందించి తన ప్రతిభను చూపడమే కాకుండా మంచి పేరు తీసుకుని రావడం పట్ల కళాశాల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థి ఎస్.మహేష్‌ని అభినందిస్తున్న దృశ్యం

అర్ధాంతరంగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రం

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 2023 సంవత్సరంలో ప్రారంభించిన అంగన్‌వాడీ భవన నిర్మాణం నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచిపోయింది. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయితే అందులో సగం నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ భవనం చుట్టూ చెత్తా చెదారం, ముళ్ల చెట్లతో నిండిపోయి అద్వానంగా తయారైందని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మాణం మధ్యలోనే నిలిచిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

వంశీ గోకుల్‌రెడ్డిని కలిసిన వైసిపి నేతలు

శింగనమల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తరిమెల వంశీగోకుల్‌రెడ్డిని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్ఆర్‌సిపి మండల నాయకులు చెన్నకేశవులు, బండి శ్రీనివాసులు, రవికుమార్, ఆది నారాయణరెడ్డి, లింగమయ్య, ధను, ఆదిలు మర్యాద పూర్వకంగా కలిశారు.

వంశీగోకుల్‌రెడ్డితో వైసిపి నేతలు

మహాశివరాత్రి సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు

కూడేరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

స్థానిక మండల కేంద్రంలోని మహాశివరాత్రి శుభ సందర్భంగా మహా పుణ్యక్షేత్రమైన శ్రీజోడి లింగాల సంగమేశ్వర స్వామి ఆల యమును ఆలయ అధికారు లు, ఆలయం ప్రాంగణమును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తుకుండా స్వామివారిని దర్శిం చుకోవడానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా నుంచి కాక ఆంధ్రప్రదేశ్ పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, నుంచి భక్తులు భారీగా తరలి వస్తారని కూడేరు పోలీస్‌స్టేషన్ అప్ గ్రేడ్ సిఐ రాజును ఆలయ అధికారులు గ్రామ ప్రజలు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా సిఐ రాజు శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయమును సందర్శించి, స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అనంతపురం జాతీయ రహదారి సాయిబాబా దేవాలయము వైపు కూడేరు నుంచి ఆలయంలోకి వచ్చే రోడ్డు గార్లదిన్నె మండలం నుంచి కమ్మూరు అరవకూరు రోడ్లు పరిశీలించి రోడ్డు వెంబడి వచ్చే భక్తులకు వారి వాహనములకు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.

బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

మురికి కాలువలకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలి - ఏఐఎఫ్ టి యూ (న్యూ)

అనంతపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

నగరంలోని ప్రధాన మురికి కాలువలైన నడిమి వంక, మరో మరువ వంకలకు ఇరువైపులా రక్షణ గోడలు తక్షణం పూర్తిస్థాయిలో నిర్మించాలని స్త్రీవిముక్తి సంఘటన, ఏ ఐ ఎఫ్ టి యు (న్యూ) డిమాండ్ చేశాయి. మంగళవారం స్థానిక టవర్ క్లాక్ వద్దనుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మురికి కాలువలకు ఇరువైపులా పూర్తిస్థాయిలో రక్షణ గోడలు లేనందున పరిసర ప్రాంతాల్లో వాసులు చెత్త చెదారం వేయడం వల్ల మురికి నీరు సజావుగా ప్రవహించడం లేదన్నారు. దీనివల్ల దోమలు, ఇతర క్రిమి కీటకాలు ఉత్పత్తి అయి పరిసర ప్రాంత వాసులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. అలాగే తేలికపాటి వర్షాలు వచ్చినా వర్షపు నీరు సజావుగా ప్రవహించడం లేదన్నారు. ఇప్పటికే పలుమార్లు పరిసర ప్రాంత ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుకొని తీవ్ర ఇబ్బందులు పడిన దుస్థితి అధికారులు, పాలకులకు తెలిసిన విషయమే. ఈ తరుణంలో ప్రస్తుత బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించి రక్షణ గోడలను తక్షణం పూర్తి స్థాయిలో నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నగరంలో ఉన్న పలు కాలనీ లల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మున్సి పల్ అధికారులకు పలు డిమాం డ్లతో కూడిన వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి సి.మల్లీశ్వరి, నాయకురాలు వెంకటలక్ష్మి, రాధమ్మ, తిరునీగిగి (న్యూ) జిల్లా నాయకుడు నాగభూషణం, నగర ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా నాయకులు హాజీ, రాజా ,రాజు, రామాంజనేయులు, బాలు, ఈశ్వరయ్య, హమాలీ యూనియన్ నాయకులు భాస్కర్, లక్ష్మీనారాయణ, తోపాటు కార్మికులు, వివిధ కాలనీల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆందోళన కారుల వద్దకు మున్సి పల్ డిప్యూటీ కమిషనర్, నగర మున్సి పల్ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్క రరెడ్డి లు చేరుకొని సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు.

ధర్నా నిర్వహిస్తున్న ఆందోళనకారులు

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బడా సుబ్బిరెడ్డి మృతి రైతు ఉద్యమానికి తీరని లోటు

అనంతపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బడా సుబ్బిరెడ్డి సంతాప సభను రైతు సంఘం జిల్లా కార్యాలయం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి రాంభూపాల్ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ సుబ్బిరెడ్డి గత 25 సంవత్సరాలుగా కదిరి ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న కరువు, వలసలు, సాగునీరు, పంటల నష్టపరిహారం పట్టు రైతుల సమస్యలువంటి అనేక సమస్యలపై నిస్వార్థంగా, అవిశ్రాంతంగా కృషి చేశారు. సుబ్బిరెడ్డి సేవలు, ఆయన నిర్వహించిన ఉద్యమాలు వ్యక్తిగతంగా సుబ్బిరెడ్డిని రైతులకు, ప్రజలకు ఎంతో దగ్గర చేశాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లా, ప్రస్తుత సత్య సాయి జిల్లాలో రైతు సంఘాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లార న్నారు. పాల రైతుల ఉద్యమం సందర్భంగా రైతు ఉద్యమంలోకి వచ్చిన సుబ్బిరెడ్డి సిపిఎమ్ పార్టీ పట్ల ఆకర్షితులు అయి సిపిఎమ్ కదిరి డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి అనంతపురం జిల్లా, సత్యసాయి జిల్లాలలో జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పనిచేశారు. కామ్రేడ్ సుబ్బిరెడ్డి గారికి భార్య మహేశ్వరమ్మ, కుమారుడు రాజశేఖర్ రెడ్డి, కుమార్తె కళావతి, కోడలు కుమారి ఉన్నారు. కామ్రేడ్ సుబ్బిరెడ్డి అకాల మరణం ఉమ్మడి జిల్లా లోని కాదు రాష్ట్రంలోనూ రైతు ఉద్యమానికి తీరని లోటు. 2022వ సంవత్సరంలో అనంతపురంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభల నిర్వహణ లోను, కరువు నివారణ కొరకు రైతులు సాగించిన సాగునీటి ప్రాజెక్టుల పోరాటం లోను, కరువు పరిస్థితుల సందర్భంలో రైతులకు కరువు సహాయక చర్యలకు కొరకు జరిగిన పోరాటంలో కామ్రేడ్ సుబ్బిరెడ్డి అవిశ్రాంత కృషి చేశారన్నారు. సుబ్బిరెడ్డి మరణం పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. బాలరంగయ్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి సిఐటియు నాయకులు టి.రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, ఎన్ మధుసూదన్ నాయుడు, విరుపాక్షి, రాజారాంరెడ్డి, బిహెచ్ రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు పోతులయ్య, ఈరప్ప, నారాయణరెడ్డి, వలీ, సంజీవ రెడ్డి, శ్రీనివాసులు, వెంకట నాయుడు, కొండారెడ్డి, దేవేందర రెడ్డి, పుష్పరాజు, సువర్ణమ్మ , చిదంబరమ్మ తదితరులు పాల్గొన్నారు

సుబ్బిరెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న రైతు సంఘం నాయకులు

జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ఎపిజిఇఎ జిల్లా కార్యాలయంలో ఎపిఎస్‌సిడబ్ల్యూఎ స్టేట్ సెక్రెటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి కడప మదన్‌మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదికకు మద్దతు ఇస్తూ, జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలు భవిష్యత్తులో సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాల్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ఈనెల 28వ తేదీ సివి రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి తమతమ కాలేజ్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వపించాలని తెలియజేశారు. జెవివి జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. ఉత్తమ సమాజం కోసం పిల్లల్ని మెర్లుగైన పౌరులు తయారు చేయాలని తెలియజేశారు. జిల్లా కోశాధికారి కోటిగారి వన్నప్ప మాట్లాడుతూ.. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయవలసిందిగా ఉపాధ్యాయులందరిని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కోశాధికారి టివిరెడ్డి మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతానని, స్కూల్ కళాశాల కార్యక్రమాలు హాజరవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమత రాష్ట్ర కార్యదర్శి శకుంతల, జెవివి జిల్లా నాయకులు జీవి బాల కృష్ణ, ఎపిఎస్‌సిడబ్ల్యుఎ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ.. వేదిక సమాజానికి అనేక అవగాహన కార్యక్రమాలు చేస్తూ విజ్ఞానాన్ని పంచుతున్నారని తెలియజేశారు. ఎపిజిఇఎ నాగరాజు, జీఎస్టీ డిపార్ట్‌మెంట్ ఆంజినేయులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సమావేశానికి హాజరైన జన విజ్ఞాన వేదిక నేతలు

భక్తుల కోరికలను తీర్చే కొంగు బంగారం శ్రీ భోగేశ్వరస్వామి

- మహిమాన్విత ప్రస్థానం శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం - నిత్యపూజలు అందుకుంటున్న అతిపెద్ద శివలింగం - నేడు శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు

పామిడి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో పామిడి శ్రీ భోగేశ్వ ర స్వామి దేవాలయం ఒకటి కాగా ఇక్కడి అతిపెద్ద శివలింగం నిత్యపూ జలను అందుకుంటుంది. కోరిన కోరికలను తీర్చే కొంగు బంగారంగా శ్రీ భోగేశ్వ రస్వామికి పేరుంది. పామిడి ప్రాంతం రాష్ట్ర, జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున భక్తులు ఇక్కడకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు జరుపుతారు. శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇక్కడ జరుగనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శిం చుకుంటారు. మాఘమాసంలో వేకువజామున ఒకపూట మాత్రమే పూజ జరుగుతుంది. మహాశివరాత్రి రోజున ఐదుసార్లు అభిషేక అర్చనలు జరుపు తారు. అదేరోజు రాత్రి మహాదేవుని ఉత్సవ విగ్రహం ఉన్నటువంటి శకటాన్ని రకరకాల పూలతో అలంకిరించి విద్యుత్ ధీపాల వెలుగులో పట్టణ ప్రధాన వీధులగుండా ఊరేగిస్తారు. భక్తులు, భజన మండలి సభ్యులు భక్తిగీ తాలను ఆలపిస్తూ వేకువజాము వరకూ జాగరణ చేస్తారు. రోగగ్రస్థులు ఆల యంలో పూజలు చేయటం ద్వారా వారికి స్వస్థత చేకూరుతుందన్నది ప్రజల ప్రగాఢ నమ్మకం.

ఆలయ చరిత్ర : పామిడి శ్రీ భోగేశ్వరదేవాలయానికి విశేష చరిత్ర ఉంది. విజయనగర సామ్రాజ్యం అనంతరం 1657లో సామంతరాజు పరమేశ్వర ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శిలాపలకం ద్వార తెలుస్తోంది. తన బార్య భోగవతి ద్వార సామంతరాజు పరమేశ్వర శ్రీ భోగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉండగా ఈ ఆలయం ప్రక్కనున్న గ్రామాన్ని భోపట్టణం అని పిలిచేవారు తదనంతరం శేషగ్రంధిపురంగా మారింది. గతంలో పెన్నానది ఉధృతంగా

04ATP25_04ATP25.qxd 25-02-2025 PM 11:07 Page 1

బాగా చదువుకొని జిల్లాకు మంచి పేరు తీసుకురండి

- ఎంపి అంబికా లక్ష్మినారాయణ - అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, ప్యాడ్లు అందజేత

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

నగరంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళ వారం అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు చేస్తున్నామని, అందులో భాగంగా వెనుకబడినటువంటి పేద విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులకు పరీక్షల్లో ఉపయోగపడే నాణ్యమైన జామె ట్రీ బాక్స్‌లను 55 మంది విద్యార్థులకు, తొమ్మిదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు నాణ్యమైన ప్యాడ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువు కొని తల్లిదండ్రులకు, ఉపా ధ్యాయులకు, పాఠశాల, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అంతేకా కుండా ఉన్నత హోదా లో విజయం సాధ ించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ పాఠశాల పిల్లల అభివృద్ధి కోసం సిఎస్ఆర్ ఫండ్ కింద కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంపి భోజన నాణ్యతను పరిశీ లించి విద్యార్థులకు వడ్డించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజినేయులు, ప్రిన్సిపాల్ పార్వతి, ప్రభుత్వ ఆసుపత్రి మెంబర్ నరసిం హులు, గుంతకల్ రైల్వే నెంబర్ శివప్రసాద్, రిటైర్డ్ హెచ్ఎం ఆంజినేయులు, రవికుమార్, బందుక రాజ, టిడిపి నాయకులు చెన్నప్ప, మంజునాథ్, లింగారెడ్డి, పాఠ శాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, రైటింగ్ ప్యాడ్‌లు అందజేస్తున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపి

60 లక్షలతో ఉడాయించాడు

సనత్ కుమార్ పై ఫిర్యాదు - గ్యాంగ్ టాక్ లో పోలీస్ కేసు - సిక్కిం రాజధానిలో వ్యవహారం

అనంతపురం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరానికి చెందిన సనత్ కుమార్ అనే వ్యక్తి పై సిక్కిం రాష్ట్రంలో కేసు నమోదు అయింది. 60 లక్షల రూపాయలు తీసుకొని ఉడాయించినట్లు బాధితులు సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్ టాక్ లోని రాణిపూల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కుంచాపు సాంబశివుడు, మలే రామా రావు, మడుపూరు శ్రీహరి, కాళస ముద్రం సనత్ కుమార్ తో కలిసి టూరిస్ట్ ప్యాకేజీ ద్వారా ఫిబ్రవరి 21వ తేదీన 237 మంది వివిధ హోటళ్లలో బస చేసేందుకు 03 రాత్రులు 04 రోజులు ప్యాకేజీని బుక్ చేసుకున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోయ, స్టెర్లింగ్ గాంగ్టక్ ఆరెంజ్ గ్రామ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టూ రిస్ట్ ప్యాకేజీలో భాగంగా, హైదరాబాద్, బెంగుళూరు, త్రివేంద్రం నుండి బాగ్డోగ్రాకు విమాన టిక్కెట్లను కొనుగోలు చేశారు. ఇందుకోసం సుమారు 60 లక్షల రూపాయలు ఖర్చు చేశామన్నారు. గ్యాంగ్‌టక్ చేరుకోగానే అతిథులు మాకు విమాన టిక్కెట్ల మొత్తం రూ. ఫిబ్రవరి 21న సుమారు 60 లక్షలు చెల్లించినట్లు బాధితులు పేర్కొన్నారు. అయితే, మరుసటి రోజు మా భాగస్వాములలో ఒకరైన కాలస ముద్రం సనత్ కుమార్ (4) డబ్బుతో తీసుకొని కనిపించకుండా పోయాడని మిగిలిన ముగ్గురు ఫిర్యాదు చేశారు. అతని కోసం గాలించినప్పటికీ ప్రయోజనం లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సనత్ కుమార్‌ను గాలించి పట్టుకొని తమకు రావలసిన సొమ్మును అప్పగి ంచాలని పోలీసులను కోరారు. దీనికి సంబంధించిన ఆధార్ కార్డులు, సిసి ఫుటేజ్ అన్ని వివరా లను పోలీసులకు ఇచ్చామని తెలిపా రు. దీనిపై రాణిపూల్ పోలీసులు క్రైమ్ డైరీలో ఫిర్యాదులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సనత్ కుమార్

మున్సిపల్ కార్మికుని కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి

- అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడు సూర్యనారాయణ - ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో కార్మికుని కుటుంబానికి టిడిపి నేతల పరామర్శ - అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన టిడిపి నాయకులు - కార్మికుని భార్యకు ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుడు సూర్యనారా యణ మృతిపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి సంతాపం వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సూర్యనారాయణ మంగళ వారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తాను అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో కార్మికుని కుటుంబానికి పరామర్శించాలని టిడిపి నాయకులను ఆదేశించారు. టిడిపి సీనియర్ నాయకుడు, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సుందర్, మాజీ కార్పోరేటర్ సరిపూటి రమణ, తెలుగు య ఉవత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మి నరసింహా, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిడిపి నాయకుడు దరూర్ ఓబుల్ నాయుడు ఇతర నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మార్చురీలో ఉన్న సూర్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్మికునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, ప్రస్తుతం కుమార్తె బిటెక్ కంప్లీట్ చేసుకోగా, కుమారుడు ఇంటర్ చదు వు తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబం పెద్ద చనిపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యేకి వినపించారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ ఆరోగ్య అది . కారి, కమిషనర్లతో మాట్లాడారు. సూర్యనా రాయణ ఉద్యోగం ఆయన భార్యకు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టిడిపి నాయకులు సూర్య నారాయణ అంత్యక్రియలకు 10వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశా రు. భవిష్యత్‌లో వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మృతదేహాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూతనివ్వండి

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

శ్రీ సత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వపరంగా చేయూతనివ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డి ఐ ఈ పి సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమన్నారు. నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనారిటీ, ఓసి మహిళలకు ప్రభుత్వ మార్గదర్శకాలు పై అవగాహన కల్పించి ఉత్పత్తి మరియు సేవారంగం పరిశ్రమల స్థాపనకు సంబంధించి వీలైనంతగా ప్రోత్సహించాలని ఆదేశించారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమల స్థాపన కొరకు (ఎం ఎస్ ఎం ఈ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించి పొందే విధంగా వారిని చైతన్య పరచాలని సూచించారు. ప్రస్తుతం సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. అలాగే జిల్లాల పరిశ్రమల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు మరియు ఆమోదం పొందిన దరఖాస్తుల వివరాలను జిల్లా కలెక్టర్ అధికారుల ద్వారా అడిగి తెలు సుకున్నారు. నిర్దిష్ట గడువు వరకు వేచి చూడకుండా సత్వ రమే ప్రభుత్వ నిబంధన మేరకు అను మతులు మంజూరు చేయా లని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిఎంఈజీపి పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్న ఎంఎస్ఎం ఈ సర్వేలను త్వరి తగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశిం చారు. బ్యాంకుల వద్ద పెండి ంగ్‌లో ఉన్న అన్ని ఆంక్ష లను లీడ్ మేనేజర్ సమర్పించాలని మరియు ఫాలో అప్ చేయాలని, 69 దరఖాస్తులు ఒక వారంలోపు క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో నానో పార్కులు అభివృద్ధి చేయడానికి నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరం గప్రసాద్, ఎల్ డి ఎం రమణ కుమార్, నాబార్డ్ ఏజీఎం అనురాధ, ఏపీ ఎఫ్ ఎఫ్ సి ప్రకాష్, డిక్కీ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డిఐపిసి సమావేశంలో మాట్లా డుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడిగా క్రాంతికుమార్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడిగా క్రాంతికుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఏపిబిబిస్ కోర్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం క్రాంతికుమార్ మాట్లాడుతూ.. గతంలో అనంతపురం జిల్లా యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలందించిన తనని గుర్తించి ఉమ్మడి అనంతపురం జిల్లా యూత్ వింగ్‌కి అధ్యక్షుడిగా నియమించిన ఏపిబిబిఎస్ కోర్ కమిటీకి, సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ కొరకు తన వంతు కృషి చేస్తానని, ఉద్యమాన్ని మరింత ముందుకి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాధవయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరవి వాల్మీకి, అనంతపురం జిల్లా ప్రొఫెషనల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, అనంతపురం జిల్లా యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ జింకల పోతన్న, అనంతపురం టౌన్ ప్రెసిడెంట్ కుళ్లాయప్ప, అనంతపురం నగర మహిళా అధ్యక్షురాలు మంజులు, అనంతపురం టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, అనంత పురం టౌన్ ప్రధాన కార్యదర్శి ముత్యాలు, రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ చెడిపోతుల కేశవ బుక్కరాయ సముద్రం మండల ప్రెసిడెంట్ ఆదినారాయణ, బుక్కరాయ సముద్రం యూత్ వింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర రుద్రం పేట కార్యదర్శి ముట్టాల పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

యూత్ వింగ్ అధ్యక్షుడిగా క్రాంతికుమార్‌కు నియామకం అందజేస్తున్న దృశ్యం

మల్లేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు

కన్నుల పండుగగా శివపార్వతుల కల్యాణం - మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత

కంబదూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగ ంగా కంబదూరు మల్లే శ్వర స్వామి వారికి కళ్యాణదుర్గం ఎమ్మె ల్యే అమిలినేని సురేం ద్రబాబు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వారిరువురు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుమును ఆలయ ఈవో దేవదాస్, అర్చకులు పూర్ణకుంభాలతో వారికి ఘన స్వాగతం పలికారు . ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు అనంతరం ఆలయంలో మంగళ వాయిద్యాలు వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ వేలాదిగా తరలి వచ్చిన భక్తుల మధ్య శివపార్వ తుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభ వోపేతంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో ఇరువురు ఎమ్మెల్యే లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేలు, అమిలి నేని సురేంద్రబాబు, పరిటాల సునీత మీడి యాతో మాట్లాడుతూ మల్లేశ్వర స్వామి వారి ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తు న్నామన్నారు. సీఎం చంద్ర బాబు సారథ్యంలో బీడీపీ ప్రాజెక్టు పనులు పూర్తి చేసే విధంగా స్వామి వారు శక్తిని ప్రసాదించాలని కోరారు. మహాశివరాత్రి పండుగ రోజున ప్రజలందరికీ శివుని కరుణ కటాక్షాలు ఉండాలని భగవంతుని వేడుకున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, పరిటాల సునీత

కళ్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు వచ్చిన వేలామంది భక్తులు

అమృత్ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

జిల్లాలో అమృత్ 1.0, 2.0 పనులను వేగవంతం చేయా లని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికా రులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అడ్వైజరీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం, గుంతకల్లు, తాడి పత్రి, తదితర మున్సిపాలిటీల్లో అమృత్ 1.0, 2.0 కింద చేపట్టిన పనులను త్వరిగతిన పూర్తి చేయాల ని ఆదేశించారు. పనుల పూర్తిపై క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వారి పని చేయాలని, ఆయా ప్రాజెక్టులను గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావా లన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేస్తేనే ఇంజనీరింగ్ అధికారులకు విలువ వుంటుందన్నారు. పూర్తయ్యే దశలో వున్న వాటిని పూర్తి చేసి ప్రారంభి ంచాలన్నారు. మరోసారి నిర్వహించే అమృత్ సమావేశానికి మున్సి పల్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు కూడా హాజరు కావాలన్నారు. ఈ సమావే శంలో పబ్లిక్ హెల్త్ ఇఇ ఆదినారాయణ, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ శేషాద్రిశేఖర్, ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి పల్లవి, మున్సిపల్ ఈఈలు రాధాకృష్ణ, షాకిల్‌హుస్సేన్, మున్సిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

సెయింట్ అగస్టీన్ పాఠశాలలో ఆకట్టుకున్న ఫేర్వెల్ డే

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం, ఫిబ్రవరి 25, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం నగరంలోని సెయింట్ ఆగస్టు ఇన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం విద్యార్థుల ఫేర్వెల్ డే ఆకట్టుకుంది. విద్యార్థినీల ఆట పాటలతో ఎంతో ఉల్లాసంగా ఉత్సా హంగా జరిగింది. అనంతపురం నగరంలోని సెయింట్ ఆగస్టీన్స్ పాఠశాలలలో 202425 సంవత్సరానికి సంబంధించి 10, తొమ్మిదవ తరగతుల విద్యార్థినీల ఫేర్ వెల్ డే కార్యక్రమం లో విద్యార్థినీలు అందరూ కలసి ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా హెడ్ మిసెస్ సిస్టర్ సుజాత మాట్లాడుతూ జీవితంలో కష్టపడకుండా ఏదీ సాధ్యం కాదని విద్యార్థులు కష్టపడి చదివి.. మంచి మార్కులు సాధించి.. తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. 10 తరగతి విద్యార్థినీల గురించి సూజాత మేడమ్ మాట్లాడుతూ సంవత్సర కాలం చదవడం ఒక ఎత్తు ఈ 15 రోజులు చదవడం ఒక ఎత్తని కష్టపడి ఇష్టపడి చదివితే జీవితంలో ఏదైనా సాదించగలమని ప్రతి విద్యార్థినీ దీనిని గుర్తు పెట్టుకోవాల న్నారు. సెయింట్ ఎగెస్టీనియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు 10 తరగతి విద్యార్థినీల సరస్వతి పూజ అనంతరం ఫేర్ వెల్ డేను ఎంతో ఘనంగా నిర్వహించినట్టు హెడ్ మిసెస్ సుజాత పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎం సుజాత

ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి

- జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

ఆర్థిక క్రమశిక్షణతో అభ్యు న్నతి సాధ్యమని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరే ట్లో మినీ కన్ఫరెన్స్ హాల్ నందు, డిఐ ఈ పీసీ, స్కిల్ , అంశాలపై సమీక్ష అనంతరం ఆర్బీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 నుం చి 28వ తేదీ వరకు నిర్వహించే ఆర్థిక అక్షరా స్యత వారోత్సవాల గోడపత్రా లను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి మంగళ వారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థలు, మహిళల పని ప్రదేశాల్లో ఆర్థిక అక్షరాస్యతపై వివిధ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ కుమార్, పరిశ్రమ శాఖ జీఎం నాగరాజు, స్కిల్ డెవలప్మెంట్ అది. కారి హరి కిరణ్, డిఆర్డిఎపిడి నరసయ్య, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సోనీ సహాని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్

ఈవిఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

ఈవిఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళ వారం అనంతపురం నగరం లోని పాత ఆర్డీఒ కార్యాలయం కాంపౌండ్ పక్కన వున్న ఈవి ఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీ షన్ ఆదేశాల మేరకు నెలవారి తనిఖీల్లో భాగంగా ఈవిఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవిఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్ల వద్ద సెక్యూరిటీ లాక్ బుక్‌లు అందరికీ అర్థమయ్యేలా నమోదు చేయాల న్నారు. లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఏఐఎస్ఐని జి ల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మలోల, ఆర్డీఒ కేశవ నాయుడు, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వ రిదేవి, ఎన్నికల విభాగం డిప్యూటి తహశీల్దార్ కనకరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్‌పి జగదీష్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి జగదీష్ మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియచేశారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జాగరణ, శివపార్వతుల కళ్యాణం, తదితర వేడుకల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శైవ దేవాయాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు జరిగే దేవాలయాలు, ప్రదేశాలనవద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

ఇందులో భాగంగా తాడిపత్రి శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి దేవాల యం, జరుట్ల రామలింగేశ్వరస్వామి, కూడేరు సంగమేశ్వరస్వామి, కోన ఉప్పలపాడు కోనమల్లేశ్వరస్వామి, కంబదూరు మల్లేశ్వరస్వామి, పంఎనూరు, కోటంక సుబ్రమణ్యేశ్వర దేవాలయాలు, అనంతపురం మొదటి రోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, తదితర దేవాయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తుతో పాటు ఆయా పరిసరాల్లో దొంగ తనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్‌పి ఆదేశించారు. మొబైక్ సెక్యూరిటీ హ్యాండ్ హోల్డ్ డివైస్ ద్వారా అనుమాని తులను చెక్ చేయాలని ఎస్‌పి తెలియచేశారు.

జిల్లా ఎస్‌పి జగదీష్